క్లుప్తంగా

రేపు మండపేట కౌన్సిల్ సమావేశం

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించనున్నట్టు కమిషనర్ టీవీ రంగారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కౌన్సిల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. 16 అంశాలతో కూడిన అజెండాపై కౌన్సిలర్లతో చర్చించనున్నట్టు కమిషనర్ రంగారావు తెలిపారు.

రేపు జాబ్‌మేళా

రామచంద్రపురం: ఏపీఎస్ఎస్‌డీసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఎస్ఈఈడీపీ, డీఆర్‌డీఏ సంయుక్తంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, యూజీ, పీజీ తదితర అర్హత కలిగిన 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల అభ్యర్థులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ముందుగా నైపుణ్యం పోర్టల్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948404165, 8247645389 మొబైల్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

రేవు నిర్మాణ పనుల పరిశీలన



మండపేటలో రేవు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట పట్టణంలోని ఒకటో వార్డులోని పెద్దకాలువ వంతెన వద్ద రేవు చేపట్టిన రేవు నిర్మాణపనులను మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం పరిశీలించారు. మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. పనుల తీరును డీఈ శ్రీనివాస్ ఆమెకు వివరించారు. ఆమె వెంట మున్సిపల్ కౌన్సిల్ వైఎస్సార్ సీపీ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ ఉన్నారు.

అఘాయిత్యాలను అరికట్టడంలో కూటమి విఫలం

కపిలేశ్వరపురం (మండపేట): రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలను అరికట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి బుధవారం ఓ ప్రకటనలో అన్నారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నా వాటిపై ప్రభుత్వం కనీస మాత్రంగానైనా స్పందించకపోవడం అమానవీయమన్నారు. ప్రభుత్వ తీరును ఖండించిన వారిలో పట్టణ మున్సిపల్ 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం నియోజకవర్గ కన్వీనర్ యరమాటి వెంకన్న బాబు ఉన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

రామచంద్రపురం: పురపాలక సంఘ పరిధిలో వెల్ల మునిసిపల్ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి సరఫరా చేసే రక్షిత మంచినీటి మైన్ పైపు లైన్ ద్రాక్షారామ రోడ్డులోని పెద్ద వంతెన వద్ద లీకేజీ ఏర్పడుట వలన మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 6 నుండి 7 గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 5.30 వరకు మాత్రమే మంచినీటి సరఫరా జరుగుతుందని, పైపు లైన్ తిరిగి పునరుద్ధరించేంత వరకు పైన పేర్కొన్న సరఫరా సమయాలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. అంతరాయాన్ని ప్రజలు గుర్తించి మంచినీటిని పొదుపుగా వాడుకోవలసినదిగా పట్టణ ప్రజలకు కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి



టేకిలో పశువైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం: నియోజకవర్గంలో పాడి పరిశ్రమాభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని టేకి గ్రామంలో రూ.26 లక్షల నాబార్డు నిధులతో నూతనంగా నిర్మించిన పశువైద్యశాలను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ పాడిశువుల సంరక్షణపై రైతులు దృష్టి సారించాలన్నారు. పశు సంవర్ధక శాఖ ఆలమూరు ఏడీఏ ఎల్.అనతి మాట్లాడుతూ ప్రభుత్వ కృషిని వివరించారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ అధికారులు, సిబ్బంది, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, గ్రామ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

భావి భారతాన్ని బడిలోనే ఉంచుదాం

- పెద్దల ఆర్థిక అవసరాలు పిల్లలకు బంధం కారాదు
- ఆటపాటలతో కూడిన విద్య బాలల హక్కు
- కాలరాస్తానంటే కఠిన శిక్ష
- నేడు బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం



బాల కార్మికుల గుర్తింపునకు మండపేటలో తనిఖీలు చేస్తున్న లేబర్ ఆఫీసర్ తదితరులు

కపిలేశ్వరపురం: చిరునవ్వుల చిన్నారి భావ భారతానికి పునాది. ఆట పాటలతో కూడిన చదువును అర్జించడం ద్వారా చిన్నారుల భవిష్యత్తూ, దేశ భవిష్యత్తూ బలమైన పునాదులతో నిర్మితమవుతుంది. పెద్ద వాళ్ల ఆర్థిక, సామాజిక అవసరాల కోసమో, తెలియని తనం వల్లనో చిన్నారులను బడికి కాకుండా పనికి పంపిస్తుండటం కొన్ని చోట్ల జరుగుతూ ఉంటుంది. దీనిపై ప్రభుత్వాలు తరచూ తీవ్రమైన చర్యలకు సైతం ఉపక్రమిస్తుంటాయి. రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో విస్తారంగా బాలలున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడంతో మెజారిటీ చిన్నారులు పాఠశాలల బాట పట్టారు. చిన్నాలను చక్కగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులతో పాటు సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. అంతకంటే ముందుగా అసలుకు బాలల హక్కులేమిటో, వారి అవసరాలేమిటో, వారికి చెప్పాల్సిన అంశాలేమిటో అందరికీ అవగాహన ఉండి తీరాలి. నేడు బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినం సందర్భంగా ఈ కథనం.

బాలల హక్కులపై అవగాహన అవసరం

తొలుత బాల్యం ప్రాధాన్యంపై అవగాహన అవసరం. పిల్లలకు తగిన వనరులు కల్పించి సేవలందించడంతో పాటు వారి భౌతిక, మానసిక సామాజికాభివృద్ధికి సహాయపడాలి. ఏ అసమానతలు లేకుండా అభివృద్ధి చెందడానికి కృషి చేయాలి.

బాలల హక్కులపై జాతీయ విధానం ఇలా

హక్కులనేవి పెద్దలకు మాత్రమే కాకుండా బాలలకు సైతం ఉంటాయి. వారి హక్కులను తల్లిదండ్రులు ఉపాధ్యాయులు గుర్తించాలి. భారత రాజ్యాంగంలో కూడా బాలల హక్కుల ఒడంబడికలను ఆమోదించారు. మనదేశంలో 1974లో బాలల హక్కులపై జాతీయ విధానం రూపుదిద్దుకుంది. 1989లో ఐక్యరాజ్యసమితి, బాలల హక్కులపై ఓ అంతర్జాయ ఒడంబడికను ఆమోదిస్తూ పది దేశాలు సంతకాలు సైతం చేశాయి. 1990లో జరిగిన కన్వెన్షన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ చిల్డ్రన్స్‌లో భారతదేశం కూడా సభ్య దేశంగా ఉంది. 1992 డిసెంబరు 11న ఈ ఒప్పందాన్ని భారత ప్రభుత్వం ఆమోదించింది. ఈ ఒప్పందం మూడు భాగాలు, 54 ఆర్టికల్స్ (అధికరణాలు) ఉన్నాయి. 41 ఆర్టికల్స్ బాలల హక్కులను, మిగతా రెండు భాగాలు వాటి అమలు, ప్రక్రియలను వివరిస్తాయి. ఈ ఒప్పందం ప్రతి బిడ్డకు రాజకీయ, పౌర సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కులను కల్పించింది.

ప్రతిబిడ్డకు జీవించే హక్కు

ఇది ఆరోగ్య ప్రమాణానికి సరైన జీవన స్థితికి ఉన్న హక్కు. దీని ప్రకారం పిల్లలు, అనారోగ్యం, ఇతర ప్రమాదాల వల్ల మరణించకుండా, ఆరోగ్యంగా జీవించే హక్కును ఆస్వాదించాలి. ప్రతి బిడ్డకు ఆహారం ఆరోగ్యం విద్యను అందించి, వారి పరిపూర్ణ , శారీరక మానసిక, సామాజిక వికాసానికి పునాది వేయాలి.

బాలల రక్షణ హక్కు

అన్ని రకాల బాధల నుంచి అవమానాలు, అమానుష్యాల నుంచి పిల్లలకు విముక్తి, స్వేచ్ఛ కల్పించడం అత్యవసర పరిస్థితుల్లో సంఘర్షణలు సంభవిస్తే ప్రత్యేక రక్షణను కల్పించాలి. దోపిడీ నుంచి రక్షణను కల్పించి వారి అభివృద్ధికి తగిన జాగ్రత్త తీసుకోవడం భారత రాజ్యాంగ చట్టం ప్రకారం 14 ఏళ్ల లోపు పిల్లలను ఫ్యాక్టరీల్లో కానీ గనుల్లో కానీ పనులు చేయించడం నేరం.

పిల్లల ఉన్నతి, వికాసం హక్కు

పిల్లల ఆలంబన, వికాసం సంరక్షణ సాంఘిక భద్రత హక్కులతో పాటు వినోదానికి సాంస్కృతిక కార్యకలాపాలకు సంబంధించిన హక్కులు కూడా ఉన్నాయి. పాఠశాలలకు వెళ్లని 5–14 ఏళ్ల పిల్లలకు (పశువులను మేపుతూ, పొలం పనులు చేసేవారు) నిర్బంధ ఉచిత విద్యను అందించాలి.

భాగం పంచుకునే హక్కు

బాలల అభిప్రాయాలపై గౌరవం, భావ ప్రకటన, స్వేచ్ఛ, సరైన సమాచారం పొందే హక్కు ఇది. పిల్లలు వారి మనస్సులోని భావాలను అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచేలా వారి భావాలకు తగిన విలువను ఇవ్వాలి. భావ ప్రకటనకు స్వేచ్ఛను కలిగించాలి.

పిల్లల కోసం చేసిన చట్టాలు

- ఆర్టికల్ 24: 14 ఏళ్ల బాలలను కర్మాగారాలు, గనులు, ఏ ఇతర అపాయకర వృత్తుల్లోనూ పని చేయించరాదు.
- ఆర్టికల్ 30: పిల్లలు ఆరగ్యోకరమైన వాతావరణంలో, గౌరవప్రదమైన స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో అభివృద్ధి చెందడానికి అవకాశాలు కల్పించాలి.
- ఆర్టికల్ 45: బాలలకు ఉచిత నిర్బంధ విద్య పిల్లల పెరుగుదల, అభివృద్ధికి సంక్షేమ చట్టాలు గార్డియన్ -వార్డ్స్ చట్టం)1890), బాల్య వివాహ నిరోధక చట్టం (1929) హిందూ వివాహ చట్టం (1955), హిందూ దత్తత, పోషణల చట్టం (1956), హిందూ మైనారిటీ, గార్డియన్‌చట్టం (1956), ప్రొబేషన్ ఆఫ్ అఫెండర్స్ చట్టం (1958), అనాథ శరణాలయ ధార్మిక సౌకర్యాల చట్టం (1960), బాల నేరస్తుల చట్టం (1986).

గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం



బాల కార్మిక వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా క్షేత్ర స్థాయిలో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్నాం. బడికి బయట ఉన్న చిన్నారులను గుర్తించి బడిలో చేర్పించేందుకు కార్యాచరణను రూపొందించాం.

– కాశిన శివనాగమల్లేశ్వరరావు, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, మండపేట

బాలల హక్కులపై అవగాహన అవసరం



బాలలనగానే ఏమీ తెలియని వారన్న తప్పుడు భావనతో ఉంటుంటారు. వాస్తవానికి వారి మెదడు వికసిస్తున్న కొలదీ నూతన తరహా ఆలోచనలు పుట్టుకొస్తుంటాయి. వారి మెదడు వికసించే అవకాశాలను, పరిస్థితులను సమాజం వారికి కల్పించాలి. అందుకు కచ్చితంగా చిన్నారులు బడిలోనే ఉండాలి. ఆట పాటలతో కూడిన విద్యను పొందేలా అందరూ కృషి చేయాలి.

– కేవీవీ సత్యనారాయణ, కన్వీనర్, జేవీవీ రాష్ట్ర నాయకుడు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న సచివాలయ సిబ్బంది, స్థానికులు

కె.గంగవరం: ప్రతి రోజు యోగా చేయడం వల్ల పూర్తి స్థాయి ఆరోగ్యంతో ఉంటామని ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అముజూరు సచివాయలం వద్ద యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ట్రెనింగ్ ప్రోగ్రాంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ యోగాసనాలు వేయడం వల్ల మానసికోల్లాసంతో పాటు ప్రశాంతత ఉంటుందన్నారు. ఈ నెల 26 వరకు ప్రతి రోజూ గ్రామంలో యోగా కార్యక్రమాలు జరుగుతాయని ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యదర్శి దుర్గాప్రసాద్, ఆరోగ్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఖాతాదారుల సహకారంతో ఉన్నత గుర్తింపు



సంస్థ వ్యాపార లక్ష్యాన్ని చేరుకుని ప్రశంసలు పొందిన పోస్టల్ ఉద్యోగులు

కపిలేశ్వరపురం (మండపేట): ఖాతాదారుల సహకారంతో మండపేట పోస్ట్ ఆఫీస్‌కి ఉన్నత గుర్తింపు దక్కిందని పోస్ట్ మాస్టారు ఏవీ సుబ్బారెడ్డి అన్నారు. తమ సంస్థ ఉన్నతోద్యోగులు నిర్దేశించిన వ్యాపార లక్ష్యాలను మండపేట పోస్ట్ ఆఫీస్ ఉద్యోగులు సకాలంలో పూర్తి చేయడంలో వారికి అవార్డులు దక్కాయన్నారు. అవార్డు గ్రహీతలను మండపేట పోస్ట్ ఆఫీస్‌లో బుధవారం జరిగిన సభలో అభినందించారు. రామచంద్రపురం సబ్ డివిజన్ సక్సెస్ మీట్‌లో మండపేట పోస్టాఫీస్‌కి 9 అవార్డులు దక్కాయన్నారు. తపాలా జీవిత బీమాలో ప్రథమ స్థానం సాధించిన కొండపల్లి సూర్యనారాయణ, ఉత్తమ ఉద్యోగి అవార్డు సాధించిన కేవీ నారాయణరావు (బాబీ), ప్రమాద బీమా పాలసీలు, ఆధార్ అనుసంధాన ఖాతాల ఓపెనింగ్ సేవల్లో అవార్డులు సాధించిన సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్.దుర్గాదేవి, ఎ.గణపతి, వై.శారదరత్నలను సుబ్బారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో ఎండీ ఎం.షరీఫ్, జి.వెంకటరావు, ఎం.అనూష, రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు టి.పుల్లేశ్వరరావు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో గ్యాస్ లీకేజీ

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు బెల్లంకొండ వారి మెరకకు సమీపంలో బుధవారం ఓఎన్జీసీ గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ లీకయింది. అంతర్వేదికరలోని ఓఎన్జీసీ బావి నుంచి గ్యాస్ సరఫరాకు ఇటీవల కొత్తగా కేశవదాసుపాలెం బెల్లంకొండ వారి మెరక మీదుగా మోరి గ్యాస్ కలెక్షన్ స్టేషన్(జీసీఎస్)కు పైపులైను అధికారులు వేశారు. ఇళ్లకు సమీపంలో వరి చేలల్లో వెళ్లిన గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ బుడగల రూపంలో లీక్ అవుతున్నట్టుగా పసిగట్టిన నివాసితులు వెనువెంటనే సదరు సంస్థ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సిబ్బంది స్పందించి గ్యాస్ లీకేజీని త్వరితగతిన అరికట్టే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఆయా బావుల పైపులైన్ల నుంచి గ్యాస్ సరఫరాను నిలుపుదల చేసేందుకు, అంతర్వేదికర గ్రామంలో ఉన్న బావుల నుంచి మోరి జీసీఎస్‌కు వెళ్లే అన్ని పైపు లైన్లలో గ్యాస్‌ను బంద్ చేసే విధంగా సిబ్బంది పనులు చేపట్టారు.

నారసింహ, సుదర్శన హోమానికి పోటెత్తిన భక్తులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బుధవారం జ్యేష్ఠా నక్షత్ర పర్వదినాన అర్చకులు నిర్వహించిన నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు హోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను, ఆశీర్వచనాలు అందజేశారు.

గోశాలకు దాణా వితరణ

అంతర్వేది ఆలయ పరిధిలోని గోశాలకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కుమార్ రైస్ ఇండస్ట్రీస్ అధినేత దేవరపు ఆనంద్ బాబు రూ.12,500 విలువ గల 20 బస్తాల దాణాను వితరణ చేశారు.

వేసవి దుక్కులకు రైతులు ప్రాధాన్యమివ్వండి



కాజులూరులో ట్రాక్టర్‌తో వేసవి దుక్కి దున్నుతున్న రైతు

కాజులూరు: రబీ పంట మాసూళ్ల అనంతరం వేసవి దుక్కులు (మెట్టదమ్ములు)కు రైతులు ప్రాధాన్యమివ్వాలని కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ సూచిస్తున్నారు. ప్రస్తుతం డెల్టాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ రైతులు రబీ మాసూళ్లు పూర్తి చేసుకున్నారు. అక్కడక్కడా కొందరు రైతులు అపరాలు సాగు చేసుకోగా అధిక శాతం రైతులు పొలాలను ఆరగట్టి ఉంచారు. ఈ పొలాల్లో వేసవిదుక్కుల వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఆయన చెబుతున్నారు.

వేసవి దుక్కులంటే..?

గతంలో వ్యవసాయరంగంలో యంత్రాలు వాడకం అంతగా లేని సమయంలో రైతులు ఎడ్లకు (పశువులకు) నాగలికట్టి దాళ్వా మాసూళ్లు చేసిన కొన్ని రోజుల తర్వాత వేసవిలో ఒక్కసారి మెట్టదుక్కు చేసేవారు. వర్షాలు పడి కాలువనీరు వచ్చిన అనంతరం మరోమారు దుక్కులు దున్నేవారు. టాక్టర్లు అందుబాటులోని రావటంతో రైతులు పొలాల్లోనికి నీరు వచ్చిన తర్వాత వెంట, వెంటనే తొలి సాలు, మలి సాలు దమ్ములు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత తరుణంలోనూ వేసవి దుక్కులు మేలైనవని నారుమడులు వేసి పొలాల్లో తొలకరి దమ్ములు చేసేందుకై ఇంకా సమయం ఉన్నందున రైతులు తమ పొలాల్లో వేసవి దుక్కులు చేపట్టాలని ఏఓ అశోక్ చెబుతున్నారు.

వేసవి దుక్కులతో ఉపయోగాలు

వేసవిదుక్కులతో కలుపు, కేళీలు నిర్మూలించ బడతాయి. భూసారం వృద్ధి చెందుతుంది. ట్రాక్టరుకి నాగలిశెట్టు కట్టి ఆరు అంగుళాల నుంచి అడుగు లోతు వరకూ దుక్కి దున్నడం ద్వారా పొలంలోని మట్టి తిరగబడుతుంది. దీంతో దాళ్వా వరి పంట నుంచి భూమిలోకి చేరిన క్రిమి, కీటకాలు, పురుగుల గుడ్లు బయలకు వచ్చి ఎండవేడికి నశించిపోతాయి. దాళ్వా మాసూళ్ల అనంతరం పొలంలో ఉండిపోయిన గడ్డి మట్టిలో కలసి చీకిపోయి సేంద్రియ ఎరువులా మారుతుంది.

పీఠాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి దంపతులు



పీఠంలో పూజలు చేస్తున్న ఏపీ హైకోర్టు జడ్జి సుమతి దంపతులు

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయ దుర్గా పీఠాన్ని ఏపీ హైకోర్టు జడ్జి జె.సుమతి దంపతులు బుధవారం సందర్శించారు. జడ్జి దంపతులను పూర్ణ కుంభంతో స్వాగతించారు. పీఠంలోని విజయదుర్గా అమ్మవారి సన్నిధిలో జడ్జి సుమతి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పీఠాధి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం(గాడ్) ఆశీస్సులు పొందారు. గాడ్ కుమార్తె సత్యవెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ దంపతులు గాడ్ సమక్షంలో జడ్జి సుమతి దంపతులను దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించి, ప్రసాదాన్ని అందజేశారు. జడ్జి వెంట అనపర్తి జేఎఫ్‌సీఎం ఎం.వంశీకృష్ణ, మండపేట సీఐ పి.దొరరాజు, రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు, సిబ్బంది ఉన్నారు.

పీఠంలో జ్యేష్ఠ పౌర్ణమి పూజలు

వెదురుపాక విజయదుర్గా పీఠంలో బుధవారం జ్యేష్ఠ పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి నెలా పీఠంలో నిర్వహించే పౌర్ణమి పూజల్లో భాగంగా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకించారు. పీఠంలో కొలువైన విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ, తులసిదళ అర్చనలు చేశారు. అమ్మవారికి లలితా అష్టోత్తర, సహస్రనామాలు, దుర్గాత్రిశతి, ద్వాత్రింశ నామావళి, లక్ష్మీ, సరస్వతి, దుర్గా అష్టోత్తరాలతో కుంకుమ పూజలు నిర్వహించారు. భవాని శంకర సమేత అష్టమ లింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి



రాయవరంలో ఏరువాక ప్రారంభిస్తున్న ఎంపీపీ వెంకటరమణ, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు



కోటిపల్లిలో సోమేశ్వర స్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

రాయవరం: మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఖరీఫ్‌లో విస్తారంగా వర్షాలు పడి అధిక దిగుబడులు రావాలని కోరుతూ ఏరువాక పౌర్ణమిని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి కొప్పిశెట్టి ప్రభాకర్ తెలిపారు. అనాదిగా వస్తున్న సంప్రదాయాన్ని పాటించేలా ఎద్దులతో పొలం దున్ని కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం రైతులను ఆర్థికంగా లాభదాయకంగా చేయాలనే ఉద్దేశంతో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న జాతీయ వాణిజ్య, వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజశేఖరరావు మాట్లాడుతూ దేశానికి రైతులే వెన్నెముక అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు, శాస్త్రవేత్తలకు ముఖాముఖి కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా రాయవరం మండలంలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. వ్యవసాయ రంగంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, పంటల సాగులో రైతులకు శాస్త్ర సాంకేతిక పద్ధతులను ఉపయోగించి అధిక దిగుబడును ఏ విధంగా సాధించాలనే అంశాలపై అవగాహన కల్పించారు. కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సంజయ్ మాట్లాడుతూ వరిలో ఉత్తమ యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన రాజశేఖర్ మాట్లాడుతూ వరి పంటలో ఎరువుల యాజమాన్యం గురించి వివరిస్తూ ఖరీఫ్ పంటకు మోతాదుకు మించి యూరియా ఉపయోగించరాదన్నారు. అధిక యూరియా వినియోగం వలన వర్షాలకు, ప్రకృతి వైపరీత్యాలకు వరి నేలకొరిగే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చాట్రాతి జానకిరాంబాబు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దేవిశెట్టి చిన్ని, సుంకవిల్లి గంగరాజు, జిల్లా వనరుల కేంద్రం ఏవో మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం: మండల వ్యాప్తంగా పలు దేవాలయాల వద్ద బుధవారం ఏరువాక పౌర్ణమి పూజలు ఘనంగా నిరహించారు. మండలంలోని కోటిపల్లి గ్రామంలో కొలువైయున్న ఛాయా సోమేశ్వర స్వామి ఆలయం వద్ద వేదపండితులు ఉదయాన్నే గోదావరి జలాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. పంటలు బాగా పండాలని, వర్షాలు కురిసి ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో రైతులు వరి సాగు చేయడానికి ఏరువాక పౌర్ణమి సందర్భంగా సమాయత్తమయ్యారు.

పింఛన్లు తొలగిస్తే ఉద్యమమే



సదస్సులో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

రామచంద్రపురం: దివ్యాంగ పింఛన్లు తొలగిస్తే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధమవుతామని దివ్యాంగ హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక చెలికాని రామారావు స్మారక భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల దివ్యాంగుల హక్కుల వేదిక అధ్యక్షుడు పలివెల రాజు ఆధ్వర్యంలో దివ్యాంగుల ఆత్మగౌరవ సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ల తనిఖీ పేరుతో కూటమి ప్రభుత్వం దివ్యాంగ పింఛన్లు రద్దు చేయడానికి కుట్ర పన్నుతుందన్నారు. దివ్యాంగ పింఛన్లు తొలగిస్తే దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో అమరావతిని ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. దివ్యాంగ బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆరోగ్యబీమా ప్రభుత్వం రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ పథకం అమలు చేయాలని. దివ్యాంగుల సహాయ సంచాలకుల కార్యాలయం కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేసి దివ్యాంగుల సహాయ సంచాలకులను నియమించాలని కోరారు. దివ్యాంగులకు 35 కేజీల బియ్యం కార్డులను మంజూరు చేయాలని, మూడు చక్రాల మోటార్ సైకిల్ వాహనాలు వెంటనే పంపిణీ చేయాలన్నారు. ఇంటి స్థలాలు రిజర్వేషన్ ప్రకారం వర్తింప చేయాలని, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూరంపూడి మాణిక్యాలరావు, దివ్యాంగుల హక్కుల వేదిక జాతీయ కార్యదర్శి ముత్యాల పోసికుమార్, రామచంద్రాపురం డివిజన్ మహిళా అధ్యక్షురాలు బంటు సత్య, దివ్యాంగుల హక్కుల వేదిక లీగల్ సెల్ కన్వీనర్ దొమ్మలపాటి సత్యనారాయణ, ఈత సూరిబాబు, కాదా శ్రీను, టైలర్ శ్రీను నాగరత్నం, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

105 పింఛన్ల మంజూరు

రాయవరం: మండలానికి 105 ఎన్టీఆర్ భరోసా స్పౌజ్ పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీవో కీర్తిస్పందన బుధవారం విలేకరులకు తెలిపారు. చెల్లూరుకు 16, కురకాళ్లపల్లి, లొల్ల గ్రామాలకు రెండేసి వంతున, కూర్మాపురం, నదురుబాద గ్రామాలకు నాలుగేసి వంతున, మాచవరం గ్రామానికి 10, పసలపూడి, సోమేశ్వరం గ్రామాలకు 12 వంతున, రాయవరం గ్రామానికి 11, వి.సావరం గ్రామానికి ఆరు, వెదురుపాకకు ఎనిమిది, వెంటూరు గ్రామానికి 18 పింఛన్లు మంజూరైనట్లు ఆమె తెలిపారు.

తగిలితే కన్ను ఖితం



వెదురుమూడి ఆర్అండ్‌బీ రహదారిపైకి పొడుచుకువచ్చిన కొమ్మలు

కపిలేశ్వరపురం: వెదురుమూడి గ్రామం పోలేరమ్మ ఆలయ సమీపంలో ఆర్అండ్‌బీ రహదారిపైకి చెట్టు కొమ్మలు శూలాల్లా పొడుచుకువచ్చి ఉన్నాయి. ద్విచక్ర వాహనదారులు ఆదమరచి అటుగా వెళితే ముఖానికి గాయాలయ్యే ప్రమాదం పొంచి ఉంది. కన్ను దెబ్బతినే అవకాశాలున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు చెట్టు కొమ్మలను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణాన్ని పునః ప్రారంభించాలి

కాజులూరు: అసంపూర్తి పనులతో నిలిచిపోయిన కుయ్యేరు, గొల్లపాలెం రహదారి నిర్మాణాన్ని పునః ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మండల వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నేత, గొల్లపాలెం ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరీదేవి అన్నారు. బుధవారం గ్రామంలో ఆమె మాట్లాడుతూ గొల్లపాలెం, కుయ్యేరుల మధ్య రూ.36 కోట్లతో 13 కిలోమీటర్ల పొడవున రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ పాలనలో నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారన్నారు. ఏడు మీటర్ల రోడ్డును 13 మీటర్ల రోడ్డుగా వెడల్పు చేసి పలుచోట్ల కల్వర్టులు, వంతెనలు పునర్నిర్మించారన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పనులు నిలిచిపోయాయన్నారు. అయితే కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదన్నారు. రోడ్డు అసంపూర్తి నిర్మాణంపై కాకినాడలో జిల్లా రహదారులు, భవనాల శాఖ కార్యాలయంలో అధికారులకు సమస్యలను వివరించి వినతిపత్రం సమర్పించామన్నారు. రహదారి వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డు తవ్వేసి వదిలి వేయడంతో వాహనాల రాకపోకలకు అవాంతరాలు ఎదురవుతున్నాయన్నారు. ఫలితంగా ఆర్టీసీ పల్లిపాలెం–కాకినాడ, దుగ్గుదుర్రు–కాకినాడ, శీల–రాజమహేంద్రవరం బస్సులను నిలుపుదల చేసిందన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పాలకులు స్పందించి పనులు పునః ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.